అన్నదాతను రోడ్డెక్కించిన కూటమి ప్రభుత్వం

• మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయానికి రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా తరలివెళ్తున్న విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల అన్నదాతలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆత్మకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు అన్నదాతల సమస్యలపై కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు ఆత్మకూరులో మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. తొలుత మున్సిపల్ బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి విక్రమ్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని ఆర్డీఓ బీ పావనికి వినతి పత్రం అందజేశారు. ఎరువులు, పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు పడుతున్న బాధలను వివరించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఏడాది పాలనలో అన్ని రంగాల్లో వైఫల్యం చెందడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. రైతులను గాలి కొదిలేయడంతో కడుపు మండిన వారు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపడుతున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్బీకేల ద్వారా రైతులు ఊరు దాటకుండా విత్తనాల నుంచి ధాన్యం కొనుగోళ్ల వరకు అన్ని రకాల సేవలను అందించినట్లుగా గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేయడంతో రైతులు అగచాట్లు పడుతున్నారన్నారు. ప్రస్తుతం ఎడగారు ధాన్యాన్ని దళారులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను దగా చేస్తూ పుట్టి రూ.15వేలకు కొనుగోలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో రూ.22 వేల నుంచి రూ.25వేల వరకు పుట్టిన ధాన్యాన్ని అమ్ముకున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తుండడం కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీగా తాము ప్రభుత్వానికి ఏడాదిన్నరకుపైగా సమయం ఇచ్చామని, సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేసిన ప్రభుత్వంపై ఇక నుంచి పోరుబాట తప్పదన్నారు. గతంలో పొగాకుకు గిట్టుబాటు ధరలు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై వైఎస్సార్‌సీపీ పోరు చేపడితే గానీ ఈ ప్రభుత్వం స్పందించలేదని గుర్తుచేశారు. ఇలా ప్రభుత్వానికి అన్ని నిరసన ప్రదర్శనలతోనే గుర్తుచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

అన్నదాత పోరు విజయవంతం

ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాత పోరు విజయవంతమైంది. అన్నదాత పోరును అడ్డుకునేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. పార్టీ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆదిశేషయ్య, రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు ఎస్ ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పీ రమేష్‌రెడ్డి, లాయర్ల విభాగం అధ్యక్షుడు నందా ఓబులేసు, రాష్ట్ర ఆర్టీఏ విభాగం కార్యదర్శి మెట్టుకూరు సుబ్బారెడ్డి, జెడ్పీటీసీలు ప్రసన్నలక్ష్మి, రావుల లక్ష్మి, ఎంపీపీలు పెయ్యల సంపూర్ణమ్మ, బోయిళ్ల పద్మజారెడ్డి, మండలాధ్యక్షులు జితేంద్రనాగ్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, పిచ్చిరెడ్డి, బీ మాలకొండారెడ్డి, పులగం శంకర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు బీ రవికుమార్‌రెడ్డి, నాయకులు కంటాబత్తిన రఘునాథరెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కల్పనారెడ్డి, కృష్ణవేణి, గంగవరపు శ్రీనివాసులు నాయుడు, అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, ఎద్దుల శ్రీనివాసులురెడ్డి, బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి, యర్రగుంట్ల పెంచలయ్య, తోడేటి మణి, షేక్ రహీం, సర్పంచ్‌లు రమాదేవి, శోభ, రైతులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీఓ పావనికి వినతిపత్రం అందజేస్తున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

బతికున్నా చంపేశారు

అన్నదాత పోరులో అప్పారావుపాళేనికి చెందిన మామిళ్లపల్లి పెంచలమ్మ అనే మహిళా రైతును చూపుతూ ఈమె బతికున్నా మృతి చెందినట్లుగా నమోదు చేసి అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎగ్గొట్టారని మేకపాటి తెలిపా రు. అయ్యా నేను బతికే ఉన్నాను అంటూ బాధిత మహిళ రైతు పత్రికా ముఖంగా మొరపెట్టుకుంటే గానీ గుర్తించని గుడ్డి ప్రభుత్వం ఇది అని ఎద్దేవా చేశారు.


పెంచలమ్మ బతికే ఉందని చూపుతున్న విక్రమ్‌రెడ్డి

వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం

ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి


అన్నదాత పోరు ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

కావలి (జలదంకి): ఏడాది పాలనలోనే కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, చంద్రబాబు, కూటమి నాయకులకు రైతుల కష్టాలు తెలియడం లేదని, అధికార మదం వీడి కళ్లు తెరిచి అన్నదాతలకు అండగా నిలబడాలని, లేని పక్షంలో వారి ఆగ్రహ జ్వాలలకు బలవుతారని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అన్నదాతల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కావలిలో అన్నదాత పోరు కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. కావలి, ఉదయగిరి నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులతో కలిసి మేకపాటి ఆర్‌ఎస్సార్ కల్యాణ మండపం నుంచి ఆర్డీఓ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని ఆర్డీఓ వంశీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మేకపాటి విలేకరులతో మాట్లాడారు. పంటలు సక్రమంగా పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదన్నారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు రోడ్ల మీదకు వచ్చిన దాఖలాలు లేవన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు ఇంటి ముంగిటకే అందజేశారన్నారు. ఆర్బీకేల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పంటలకు మద్దతు ధర అందించారని గుర్తుచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడం చేతకాక చేతులెత్తేసిందన్నారు. రైతులు సంక్షోభంలో ఉంటే ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రికి పట్టడం లేదన్నారు. ఎరువుల కోసం రైతులు క్యూలో నిల్చుంటే బఫేమీల్స్ కోసం నిలబడినట్లుగా ఉన్నారని పోల్చిన అచ్చెన్నాయుడు వ్యవసాయ మంత్రిగా పనికిరాడన్నారు. రైతులను విస్మరించిన ప్రభుత్వాలకు మనుగడ ఉండదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకుని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందిటి కామరాజు మాట్లాడుతూ రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల్లో 50 శాతం మార్క్‌ఫెడ్‌కు, మిగిలిన 50శాతం ప్రైవేట్ డీలర్లకు కేటాయిస్తారన్నారు. కానీ ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌కు కేటాయించే ఎరువుల్లో కోత విధించడంతో ప్రైవేట్ డీలర్లు యూరియాను బ్లాక్ చేసి రూ.267కు అమ్మాల్సిన బస్తాను రూ. 450 వరకు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. బ్లాక్ మార్కెట్‌కు ఎరువులు తరలిపోవడం సిగ్గుచేటన్నారు. రైతుల కష్టాలను పట్టించుకోని కూటమి ప్రభుత్వానికి రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు మేదరమెట్ల శివలీల, పీ మాల్యాద్రిరెడ్డి, గణపం బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు కనమర్లపూడి వెంకటనారాయణ, కావలి నియోజకవర్గ మండలాల అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, మద్దిబోయిన వీరరఘు, దండా కృష్ణారెడ్డి, మహేష్‌నాయుడు, కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ మండలాల అధ్యక్షులు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, కొండా రాజగోపాల్‌రెడ్డి, ఆర్ శ్రీనివాసులరెడ్డి, కాటం రవీంద్రరెడ్డి, చిమ్మిలి రవీంద్ర, వాసుదేవరెడ్డి, ఎం తిరుపతినాయుడు, నాయకులు చేజర్ల సుబ్బారెడ్డి, పాలవల్లి మాలకొండారెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, పల్లాల కొండారెడ్డి, షేక్ ఆలీఅహ్మద్, చింతంరెడ్డి సుబ్బారెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, కేతిరెడ్డి రవిరెడ్డి, దేవరపల్లి రఘురామిరెడ్డి, సురె శేషారెడ్డి, చేజర్ల హరిబాబురెడ్డి, బిజ్జం ఉదయ్ భాస్కర్‌రెడ్డి, వేలమూరి మహేశ్వరరెడ్డి, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, కలికి ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌కే కృష్ణారెడ్డి, వాయిల తిరుపతి, జంపాని రాఘవులు, కుందుర్తి కామయ్య, కొండూరు శ్రీనివాసులు కొమారి రాజు, నాగేశ్వరమ్మ, చేవూరు పద్మ, కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీఓ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి, కావలి నాయకులు


కావలికి మేకపాటితో కలిసి తరలివెళ్తున్న నాయకులు

అన్నదాత పోరు సక్సెస్

కావలిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాత పోరు విజయవంతమైంది. అన్నదాత పోరును అడ్డుకునేందుకు పోలీసులు ఆంక్షలు విధించినా కావలి, ఉదయగిరి నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆర్‌ఎస్సార్ కల్యాణ మండపం వద్ద నుంచి అంబేడ్కర్ విగ్రహం, అక్కడి నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీఓకు వినతి పత్రం అందజేయాల్సి ఉండగా పోలీసులు అడుకున్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్దకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వలేదు. కల్యాణ మండపం గేట్లకు తాళాలు వేసి ముఖ్యమైన నాయకులు, వారితో పాటు కొద్ది మందిని మాత్రమే విడతల వారీగా ఆర్డీఓ కార్యాలయానికి పంపించారు.

క్లుప్తంగా

పారిశుధ్యం మెరుగునకు చర్యలు



సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: పట్టణంలోని 5వ వార్డులో పారిశుధ్యం మెరుగునకు మున్సిపల్, ఆరోగ్య సిబ్బంది చర్యలు చేపట్టారు. 5వ వార్డు శివార్లలో బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద ఉన్న మున్సిపల్ స్థలంలో మురుగు నిల్వ ఉండి దోమలు ప్రబలడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ఈ విషయమై 'సాక్షిలో ' 'అధ్వానంగా పారిశుధ్యం' శీర్షికన మంగళవారం కథనం రావడంతో మున్సిపల్, ఆరోగ్య సిబ్బంది స్పందించారు. మున్సిపల్ సిబ్బంది మురుగును తొలగించగా, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ అస్మా ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ సుధాకర్, ఆశాకార్యకర్తలు పద్మ, లక్ష్మి, ఏఎన్‌ఎం బీబీజాన్ బ్లీచింగ్, దోమల నివారణ మందు చల్లించారు.

ఏడీఏకు సన్మానం



ఉదయగిరి: స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఉదయగిరి ఏడీఏ పనిచేస్తూ డిప్యూటేషన్‌పై కడపకు వెళ్తున్న డీ లక్ష్మీమాధవిని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, మండల వ్యవసాయాధికారులు, సిబ్బంది మంగళవారం శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఏడీఏ సేవలను కొనియాడారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డుల పంపిణీ



ఉదయగిరి రూరల్: సంజీవరాజుపల్లె ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు గుర్తింపుకార్డులు, గ్రీన్‌కార్డులను ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు మంగళవారం పంపిణీ చేశారు. విద్యార్థులకు ఏటా ఐడీ కార్డులను వితరణ చేస్తున్న ఉపాధ్యాయుడు యజ్ఞను అభినందించారు. పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంపై సర్వే

ఆత్మకూరురూరల్: వెన్నువాడలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఎంజీఎస్‌వై రోడ్డు నిర్మాణానికి సంబంధించిన 200 మీటర్ల భూమిని రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు మంగళవారం సర్వే చేశారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి వారి ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. పీఆర్ ప్రాజెక్ట్ విభాగం డీఈ సుధాకర్‌రెడ్డి, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ ప్రసాద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు పోలీసుల నోటీసులు

ఉదయగిరి: ఉదయగిరి మండల నాయకులకు పోలీసులు నోటీసులు జారీచేశారు. మంగళవారం కావలి ఆర్డీఓ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి హాజరైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న వారిలో పార్టీ మండలాధ్యక్షుడు కొండా రాజగోపాల్‌రెడ్డి, నాయకులు జి.శ్రీనివాసులురెడ్డి, కె.రమణారెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లురెడ్డి, దస్తగిరి అహ్మద్, తదితరులున్నారు.


రాజగోపాల్‌రెడ్డికి నోటీసు అందజేస్తున్న పోలీసు

వైభవంగా గణేశ్ నిమజ్జనం

సంగం: స్థానిక దొమ్మరిపాళెంలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన 11 అడుగుల భారీ వినాయకుడి విగ్రహాన్ని సోమవారం అర్ధరాత్రి నిమజ్జనానికి తరలించారు. వినాయకుడిని క్రేన్ సాయంతో ట్రాక్టర్‌పై కొలువుదీర్చి విద్యుద్దీపాలు, పూలతో విశేషంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లి పెన్నానదిలో నిమజ్జనం చేశారు. తొలిసారిగా ఏర్పాటు చేసిన భారీ వినాయక ప్రతిమను వీక్షించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



యూరియాను మోతాదు మేరకే వాడాలి

అల్లూరు/దగదర్తి/వింజమూరు(ఉదయగిరి): మోతాదు మేరకే యూరియాను వాడాలని అల్లూరు ఏఓ వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని గోగులపల్లిలో అధిక మోతాదులో యూరియా వాడడం వల్ల కలిగే అనర్థాలపై రైతులకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. పంటకు భాస్వరం, పొటాష్, సూక్ష్మపోషక ఎరువులు అవసరమని, ఇవి ఖరీదు ఎక్కువగా ఉండడంతో రైతులు యూరియా ఎక్కువగా వేస్తున్నారన్నారు.వరికి యూరియాను అధికంగా వాడడం వల్ల తెగుళ్లు ఎక్కువగా సోకి దిగుబడులు తగ్గుతాయన్నారు. అలాగే దగదర్తి మండలం దుండిగం, ధర్మవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ శ్రీధర్‌రెడ్డి రైతులకు యూరియాను అధికంగా వాడడం వల్ల తలెత్తే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. అలాగే వింజమూరు మండలం చాకలికొండ సచివాలయంలో యూరియా అధికంగా వాడటం వల్ల తలెత్తే దుష్పరిణాలపై మంగళవారం రైతులకు అవగహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయాధికారి శేషాద్రి మాట్లాడుతూ అధికారులు సిఫార్సు చేసిన మేరకు పంటలకు యూరియా వాడాలన్నారు. యూరియా అధికంగా వాడడం వలన ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. సేంద్రియ సాగును చేపట్టాలని రైతులకు సూచించారు. ముప్పై రకాల విత్తనాలతో కూడిన పది కేజీల పచ్చిరొట్ట బ్యాగును రూ.650కే అందజేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఓ వాసు, ప్రకృతి వ్యవసాయ అధికారి సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.


దగదర్తి:అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీధర్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో కేజీబీవీ ప్రిన్సిపల్‌కు తీవ్రగాయాలు

సంగం: మండలంలోని కొరిమెర్ల వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కలిగిరి కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రిన్సిపల్ కే సుప్రియ తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. కలిగిరి కేజీబీవీ ప్రిన్సిపల్ సుప్రియ తన స్కూటీపై సంగం నుంచి కలిగిరి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో కొరిమెర్ల సమీపంలో స్కూటీ అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రురాలిని ఆటోలో సంగం వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి తలకు బలమైన గాయమై ఉండడంతో నెల్లూరుకు తరలించాలని సూచించారు. దీంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. సంగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

15 నుంచి గాలికుంటు టీకాలు

ఉదయగిరి రూరల్: మండలంలోని పశువులకు ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయనున్నట్లు పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ మంగళవారం తెలిపారు. పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు సోకకుండా టీకాలు వేయించుకోవాలని కోరారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

సీతారామపురం : మండలంలోని గంగవరం గ్రామంలో విద్యుత్ సమస్యలపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. నెమళ్లదిన్నె పంచాయతీ సర్పంచ్ తోకల రామచంద్ర మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు దెబ్బతిని ఉన్నాయని, తీగలు కిందకు వేలాడుతున్నాయని తెలిపారు. లోఓల్టేజీ సమస్య అధికంగా ఉందన్నారు. స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ శ్రీహరి సత్వరమే విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

సొసైటీ అభివృద్ధికి సహకరించండి

సీతారామపురం: నెల్లూరులోని డీసీసీబీ కార్యాలయంలో జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ ధనుంజయరెడ్డిని మారంరెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షుడు ఎస్ రాజశేఖర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సొసైటీ ప్రాంగణంలో గోదాము, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు సంబంధించి పంపిన ప్రతిపాదనలను ఆమోదించాలని, రైతులకు సత్వరమే రుణాలను మంజూరు చేయాలని కోరారు.

మర్యాదపూర్వకంగా..



ఉదయగిరి: నెల్లూరులో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడిగా నియమితులైన కొడవలూరు ధనుంజరెడ్డిని ఉదయగిరికి చెందిన పలువురు నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొడవలూరుకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉదయగిరి ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, నాయకులు గడియాల్చి యస్దాని, ఉప్పుటూరి హరి, ఉప్పుటూరి శ్రీను, తదితరులు ఉన్నారు.

ఉదయగిరి ఇన్‌చార్జి ఏడీఏగా చెన్నారెడ్డి

ఉదయగిరి: ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఏడీఏగా పీ చెన్నారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీఏ పనిచేస్తున్న లక్ష్మీమాధవి డిప్యూటేషన్‌పై వైఎస్సార్‌జిల్లా కడప ఏడీఏగా వెళ్లారు. ఆమె స్థానంలో సీతారామపురం మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఇన్‌చార్జి ఏడీఏగా జిల్లా అధికారులు నియమించారు.

జాబ్‌మేళా నేడు

ఆత్మకూరు: పట్టణంలోని బీఎస్సార్ ఐటీఐలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లుగా ప్రిన్సిపల్ బీ ప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే జాబ్‌మేళాకు ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ పూర్తి చేసిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐసీడీఎస్ కార్యాలయం మూత



ఉదయగిరి రూరల్: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం మంగళవారం ఉదయం 11.30 గంటల వరకు తెరచుకోలేదు. ఉదయం పది గంటలకు కార్యాలయాన్ని తెరవాల్సి ఉన్నా తెరవకపోవడంతో వివిధ పనులపై వచ్చిన కార్యార్థులు వెనుదిరిగి వెళ్లారు. ఈ విషయమై సీడీపీఓ పుణ్యవతిని సంప్రదించగా తాను అంగన్‌వాడీ కార్యకర్తల ఇంటర్వ్యూల నిమిత్తం ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లానని తెలిపారు. కార్యాలయాన్ని తెరిచి ఉంచాలని యాక్టివ్ సూపర్‌వైజర్‌కు సూచించి వెళ్లానన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.315

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం 313 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లుగా వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 519 బేళ్లు రాగా, అందులో 313 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.315, కనిష్టంగా రూ120, సగటున రూ.209.14 ధర పలికిందని వివరించారు.

మెనూలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

వింజమూరు(ఉదయగిరి): వసతిగృహ విద్యార్థులకు మెనూ ప్రకారం వడ్డించాలని, మెనూ విషయంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి శోభారాణి వార్డెన్లను హెచ్చరించారు. వింజమూరులోని ఎస్సీ బాలుర, బాలికల వసతిగృహాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల్లోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ అమలుపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల్లో మెరుగైన వసతులు, నాణ్యమైన భోజన వసతి కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు వెంటనే అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయగిరి సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి పీ రమణారెడ్డి, సంక్షేమాధికారులు పాల్గొన్నారు.


వసతి గృహ విద్యార్థులతో మాట్లాడుతున్న శోభారాణి

పొగాకు నారుమడుల పరిశీలన

కలిగిరి: మండలంలోని కావలియడవల్లి, వేల్పులగుంట, కమ్మవారిపాళెం గ్రామాల్లో సాగుచేసిన పొగాకు నారుమడులను కలిగిరి పొగాకు వేలం కేంద్రం వేలం నిర్వహణాధికారి శివకుమార్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడులను సాగు చేసే రైతులు పొగాకు బోర్డులో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పొగాకు బోర్డు రిజిస్ట్రేషన్ లేకుండా నారు పోసి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నారుమడుల సాగులో యజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. క్షేత్రాధికారి ఎస్ సంతోష్, క్షేత్ర సహాయకులు బుట్టి రోహిత్, వీ వెంకటేష్ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఖాళీల భర్తీ కోసం మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ బీ పావని, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 60 మందికిపైగా అభ్యర్థినులు హాజరయ్యారు. త్వరలో ఫలితాలు వెల్లడిస్తామని, వ్యక్తిగత సమాచారం ఇస్తామని పీడీ హేనాసుజన్ తెలిపారు. ఆత్మకూరు, అనంతసాగరం, ఉదయగిరి, రాపూరు సీడీపీఓలు సునీలత, పద్మావతి, పుణ్యవతి, సునంద, ఆత్మకూరు అర్బన్ హెల్త్‌సెంటర్ డాక్టర్ అస్మా, తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్సుల తరలింపుతో విద్యార్థుల అవస్థ

కావలి (జలదంకి): అనంతపురంలో బుధవారం కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్-సూపర్ హిట్ సభను నిర్వహిస్తోంది. ఈ సభకు కావలి డిపో బస్సులను తరలించడంతో ఒట్టూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు మంగళవారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కావలి నుంచి ఒట్టూరు ఆదర్శ పాఠశాలకు నిత్యం 200 మందికి పైగా విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు వెళ్తుంటారు. అలాగే కావలి నుంచి రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాల, వీరేపల్లి ఆదర్శ పాఠశాలకు కూడా విద్యార్థులు వెళ్తుంటారు. బస్సులు లేకపోవడంతో కొంతమంది ఆటోల్లో వెళ్లగా, మరికొందరు ఇళ్లకు వెళ్లిపోయారు. మూడ్రోజుల పాటు బస్సులు ఉండవని తెలియడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ వైఖరి, అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు సమాచారం లేకుండా బస్సులను రద్దు చేస్తే తమ పిల్లలు స్కూల్‌కు ఎలా వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు.


బస్సులు లేక ఆటోలో వెళ్తున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు

బాధితులకు ఆర్థిక సాయం

ఉదయగిరి: మండలంలోని అప్పసముద్రంలో గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా చోటు చేసుకున్న బాణసంచా పేలుడు ఘటనలో గాయపడిన తొమ్మిది మంది చిన్నారులకు సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల చొప్పున ఆర్థిక సాయం మంజూరు చేసినట్లుగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడును కలిసి చిన్నారుల పరిస్థితిని వివరించగా సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం మంజూరు చేయించారని వివరించారు.

భూఆక్రమణపై ఫిర్యాదు

అనుమసముద్రంపేట: తమ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించాడని కావలియడవల్లి గ్రామానికి చెందిన దళితుడు ముత్యాల మనోహర్ ఏఎస్‌పేట తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. 1985 నుంచి సర్వే నంబర్లు 341, 342లోని ఐదెకరాల మెట్ట భూమిని సాగుచేసుకుంటున్నానని తెలిపారు. సదరు భూమి ప్రస్తుతం గ్రామంలో మీసేవ కేంద్రం నడుపుతున్న అగ్రవర్ణానికి చెందిన ఓ వ్యక్తి పేరుతో రికార్డుల్లో నమోదై ఉందని తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు.